



# ఈసప్ నీతి కథలు

## సుధామ



# ఈసఫ్ నీతి కథలు

**రచన**

సుధామ

**ప్రచురణ**

శ్రీ మానస పబ్లికేషన్స్

శ్రీపతి సూర్యనారాయణ వీధి

గవర్నరుపేట : : విజయవాడ - 520 002.

# ఈసఫ్ నీతి కథలు

సుధామ

శ్రీ మానస ప్రచురణ
ప్రథమ ముద్రణ
మే - 2001

వెల. రు. **14-00**

లోపలి బొమ్మలు
ముఖ చిత్రం } గోపి

All Rights including subject matter and
Title style are reserved with the publishers.

# ఈసఫ్ నీతి కథలు


పంచతంత్రం కథలు జంతువులను పాత్రలుగా చేసి మనుషుల స్వభావాలను వివరించిన కథలు. పిల్లల మనసు తెలుసుకుని వారిని మంచి నడవడికలో పెట్టేందుకు నీతి కథలు ఉపయోగపడతాయి. ఈసఫ్ నీతి కథలు ప్రపంచ తంత్రం వివరించే కథలు. జంతువులను, పిట్టలను ఉదహరిస్తూ మంచిమాటలు, సూక్తులు ఈసఫ్ కథలలో చెప్పడం కనిపిస్తుంది. వాటిలో కొన్ని చదువుకుందాం.

## 1

ఓ మైదానం వుంది. బాతులు, కొంగలు అక్కడ నేస్తులు. కలసి తిండి ఏరుకుంటూ తిరుగుతుంటాయి ఒకరోజు కొందరు వేటగాళ్లు విల్లూ బాణాలు పట్టుకుని అక్కడకు వచ్చారు.

తేలికగా వుండే తెల్లని కొంగలు తుర్రున హాయిగా ఎగిరిపోయాయి. బరువైన బాతులు ఎగరలేక అక్కడే ఉండి పోయాయి. వేటగాళ్లు వాటిని పట్టుకుని వెళ్లిపోయారు.

ఏదయినా ఆపద సంభవించినప్పుడు బరువు బాధ్యతలు లేనివారికి ఏ బాధ వుండదు. వారు తేలికగా తప్పించుకుంటారు.






## 2


అడవిలో నెమలి, కొంగ ఉంటున్నాయి. ఒకరోజు ఆకాశంలో మబ్బులు పట్టాయి. మెరుపు మెరిసింది. ఆ వెంటనే ఉరుము ఉరిమింది.

మేఘం చేసిన ధ్వని నెమలికి ఉత్సాహం కలిగించింది. నెమలి పింఛం విప్పింది. ఉరుములే తాళంగా అందంగా నృత్యం చేసింది. కొంగ నెమలి నృత్యం చూసి బాగుందని పొగిడింది.

పొగడ్తకు నెమలికి గర్వం పొడుచుకు వచ్చింది. కొంగతో "నాలాగా నువ్వు పింఛం విప్పి నాట్యం చెయ్యి చూద్దాం" అంది ఎగతాళిగా.

నెమలి మాటలకు కొంగకు బాధ కలిగింది. రెక్కలు విప్పి ఆకాశంలోకి ఎగిరిపోతూ అంది -






“నీ పింఛం అందంగా వుంది. కానీ అది దేనికి పనికి వస్తుంది. నాలాగా స్వేచ్ఛగా ఇలా ఎగురు చూద్దాం” అంది.

**3**

ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం ముఖ్యంగానీ అందుకు కారణాలు తవ్వి నీతి బోధలు వల్లించడం కాదు.

ఒక పిల్లవాడు నదిలో స్నానం కోసం దిగాడు. చాలా సేపు ఒడ్డుకు దగ్గరగా ఎక్కువ లోతులేని నీటిలో ఈత కొట్టాడు.




కొద్దిసేపటికి మరి కొంచెం లోతుకు పోయి ఈత కొట్టాలి అని పించింది. కొన్ని గజాలు నదిలోకి వెళ్లాడు. కాళ్ళకి నేల అంద లేదు. భయం వేసింది. కాళ్లూ చేతులూ ఆడలేదు. "బాబోయ్ రక్షించండి బాబోయ్ మునిగి పోతున్నా బాబోయ్" అని భయంతో అరిచాడు.

ఆ కేకలు విని ఒక పెద్దాయన అటుగా వచ్చాడు వస్తూనే - "నీకు బుద్ధీ జ్ఞానమూ ఏమయినా ఉన్నాయా? ఎవరు వెళ్లమన్నారు అంత లోపలికి" అని తిట్టడం మొదలు పెట్టాడు.



కుర్రవాడు చేతులు నీటిలో తపతప కొడుతూ


''ముందు నన్ను ఒడ్డుకు చేర్చండి. అటు తరువాత తీరికగా మీ తిట్లు తింటాను. మునిగి పోతున్నా రక్షించండి'' అని అరిచాడు.



## 4


పొగరుమోతు కుక్క ఒకటి ఉండేది. వెనుక పాటున వచ్చి ఎవరిని పడితే వారిని కరిచేది. పిల్లలు,పెద్దలు అది ఎప్పుడు వచ్చి మీదపడి కరుస్తుందో అని భయపడి పోయేవారు.

చూసి చూసి ఆ కుక్క యజమాని ఇక లాభం లేదని ఆ పొగరు మోతు కుక్క వస్తోందని ముందే హెచ్చరికగా వుండేందుకు దాని మెడలో ఒకగంట కట్టాడు. ఇక ఆ కుక్క నడుస్తూ వుంటే గంట గణగణ మని చప్పుడు చేస్తూండేది. దానితో ఎక్కడి వారక్కడ తప్పుకునేవారు.



ఒక రోజు బజారులో గర్వంగా గంట మోగించుకుంటూ నడుస్తోంది కుక్క. దానిని చూసి ఇంకొక ముసలి కుక్క - "నీ మెడగంట చూసుకుని మురిసి

పోతున్నట్లు న్నావ్. అది నీకు ఏదో గొప్ప విషయంగా తోస్తున్నదేమో! అది నీ గొప్పతనానికి ఇచ్చిన బహుమతి కాదు. అందరినీ కరిచే నీ చెడ్డబుద్ధికి గుర్తుగా కట్టిన గంట అది. అది చూసుకుని గర్వపడడంకాదు. నిజానికి నువ్వు సిగ్గుపడాలి''
అంది ముసలి కుక్క.



## 5

ఒక సింహం సముద్రతీరాన తిరుగుతోంది దానికి ఒడ్డు దగ్గరే నీటిలో తేలుతూ వున్న మొసలి కనబడింది. దానిని ఆశ్చర్యంగా చూసి 'ఎవరోయ్ నువ్వు' అని సింహం ప్రశ్న వేసింది.

"నేను ఈ సముద్రానికి రాజును. నన్ను మొసలి అంటారు" అని జవాబు చెప్పింది మొసలి.

"చాలాబాగుంది నేను అడివికి రాజును. నువ్వు సముద్ర రాజువి. ఇద్దరం స్నేహం చేద్దాం. మన ఇద్దరం కలిస్తే మనలను జయించగల వీరుడు లోకంలోనే ఉండడు" అంది సింహం.

అలాగేనని స్నేహానికి ఒప్పుకుంది మొసలి. రోజూ కలసి కబుర్లు చెప్పుకుంటూ అవి కాలక్షేపం చేస్తూండేవి.

ఒకరోజు సముద్రతీరానికి ఏనుగు వచ్చింది. అడవికి రాజు ఎవరు? అనే విషయంలో ఏనుగుకి, సింహానికి మాటామాటా వచ్చి పోరుకి దిగారు. చాలాసేపు పోరాడేసరికి సింహానికి అలసట వచ్చింది.

ఒడ్డున నీటిలో నుంచి ఈ యుద్ధం అంతా చూస్తున్న మొసలితో సింహం - "అలా చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు ఉండకపోతే నాకు కాస్త సహాయం చేయకూడదా? మనం స్నేహితులం కదా!" అని అడిగింది.

"నీకు సాయం చేయాలనే ఉంది. కానీ చేయలేను. ఎందుకంటే నా ప్రతాపం అంతా నేలమీద పనిచేయదు.

నీటిలోనే వీరుడిని నేను” అని లోపలికి వెళ్లిపోయింది మొసలి.

“అందుకే మంచితనం ఒక్కటి సరిపోదు స్నేహితులను ఎంచుకొనడానికి. వారి అర్హతలను యోగ్యతలను కూడా చూసి మరీ ఎంపిక చేసుకోవాలి”.

## 6

గరికపచ్చ మైదానంలో ఒక ఎద్దు మేతమేస్తోంది. ఒక ఈగ ఆ ఎద్దు చుట్టూ చాలాసేపు తిరిగితిరిగి దాని కొమ్ము మీద వాలింది. కానీ వెంటనే ఇలా అంది.

“చూడండి ఎద్దు మహాశయా! మీకు బరువు అనిపిస్తే చెప్పండి. ఇంకొక చోటుకుపోయి ఆడుకుంటాను”

“ఫరవాలేదు. ఆడుకో. నువ్వునా మీద వాలినా మానినా ఒక్కటే. అసలు నువ్వు నా మీద వాలినట్లు నువ్వు చెప్పే దాకా నాకు తెలియను కూడా తెలియదు” అంది ఎద్దు.

అల్ప బుద్ధులకు అతిశయం ఎక్కువ అని ఊరికే అన్నారామరి!

## 7

ఈసఫ్ పిల్లలతో గోలీకాయలు ఆడుతూ వీధిలో కనిపించేసరికి దారినపోయే ఒకాయన గొల్లున నవ్వాడు.


"నువ్వేమో పెద్ద వేదాంతివా? తీరా చేసే పని చిన్న పిల్లలతో గొలీలాడడమా" అన్నాడు ఆయన ఈసఫ్ ఏమీ మాట్లాడ లేదు. తన ఇంట్లోకి పోయి వచ్చి ఒక విల్లు తీసుకు వచ్చి వీధిలో పడవేసాడు. ఆ విల్లుకు త్రాడు బిగించిలేదు. దానిని చూపించి ఈసఫ్ ఆ పెద్దాయనతో - "నువ్వు చాలా తెలివైన వాడివని



కదా అనుకుంటుంటావు. దీని అర్థం ఏమిటో తెలుసుకుని చెప్పు చూద్దాం" అన్నాడు.

పెద్దమనిషికి ఎంత ఆలోచించినా ఏమీ తట్టలేదు. బుర్ర గోక్కుని "నువ్వేచెప్పు" అన్నాడు.

"ఈ వింటి త్రాడు గట్టిగా బిగించి మొత్తం అలాగే వుంచితే ఎప్పుడో పుటుక్కుని తెగుతుంది. అవసరమైనప్పుడే వింటికి నారి బిగించి వుంచాలి.



అవసరం లేనప్పుడు నారి వూడదీసి వుంచాలి. మన మనసు కూడా విల్లు

వంటిదే. దానికీ అప్పుడప్పుడు విశ్రాంతి ఇవ్వాలి. ఆలోచన అవసరమైనప్పుడు దానిని ఏకాగ్రతలోకి మలుచుకోవాలి' అన్నాడు ఈసఫ్.

## 8

చెరువు గట్టున కూరుచున్న ఒక కప్ప. అక్కడి పచ్చిక బయలులో మేస్తున్న ఒక ఎద్దును చూసింది. ఎద్దును చూస్తున్న కొద్దీ కప్ప మనసు అసూయతో నిండింది. "ఈ ఎద్దు ఇంత పెద్దదిగా ఎందుకు వుండాలి? నేను చిన్నగా ఎందుకుండాలి?" అని మనసు కుతకుత లాడింది దానికి. ఏమయినా సరే ఎద్దుకన్న పెద్దది కావాలని దానికి చెడు బుద్ధి పుట్టింది.



కప్ప గాలి బాగా పీల్చి పొట్ట ఉబ్బరించింది పక్కన వున్న కప్పలను అడిగింది - "ఇప్పుడు ఎద్దుకంటే పెద్ద దానిని అయ్యానా లేదా" అని.



“లేదు” అన్నాయి అవి.

ఇంకా పొట్ట ఉబ్బించింది కప్ప. ఎన్నిసార్లు అడిగినా సాటికప్పలు ఎద్దే పెద్దది అంటున్నాయి. కోపంతో రెచ్చిపోయి కప్ప ఇంకా పొట్టను పెద్ద బంతిలా ఉబ్బించింది. దాంతో టప్పున పొట్ట పగిలిపోయింది.

“ఎవరి అంతరం ఎంతో తెలుసుకోవాలి”

“లేని పోని గొప్పలకు పోతే కప్పకు పట్టిన గతే పడుతుంది.”

## 9

అడవిరాజు గారయిన సింహం వేటకు బయలు దేరారు. ఒక గాడిద సింహం దగ్గరకు చేరి -

“మీ బలమూ నా వేగమూ కలిస్తే ఎన్ని జంతువులనైనా మనం ఇట్టే వేటాడి పట్టేసుకోగలం” అంది గాడిద. సింహం సరే అంది.

సాయంకాలం వరకూ వేటాడి మొత్తం మీద రెండూ కలిసి అనేక జంతువుల్ని పట్టుకు చంపాయి. వాటిని అన్నింటినీ సింహం ఒక చెట్టు కిందకు చేర్చింది. మూడు వాటాలు వేసి ఇలా అంది.

“ఇదిగో ఈ మొదటి వాటా చూశావా! ఇది నాది. ఎందుకంటే నేను అడివికి రాజును కదా. ఇక రెండో వాటా

నీతో పాటు నేనూ వేటాడాను కనుక నాకు ఎలాగూ ఇవ్వ వలసింది. ఇక మూడోది. నువ్వు వెంటనే కాలికి బుద్ధి చెప్పకపోతే తరువాత ఏడుస్తూ కూర్చోవడానికి నువ్వు మిగలనే మిగలవు సుమా"

తమకన్న బలవంతులతో కాదు స్నేహం చేయవలసింది. ఎవరి శక్తికి తగినట్లు వారు ప్రవర్తించాలి.

## 10

ఒకడు ఒక కాగితం మీద తనను గురించి పొగుడుకుంటూ రాసుకున్నాడు. అది ఈసఫ్ దగ్గరకు తీసుకుపోయి చదివి వినిపించి -

"ఏం మహానుభావా ఏమంటావ్! నా శక్తి సామర్థ్యాలు ఏమిటో ఇప్పుడయినా తెలిసాయా" అని అడిగాడు ఈసఫ్‌ను.

అదివినే సరికే ఈసఫ్‌కు తలపోటు వచ్చింది. "విన్నానులే, లోకంలో మరి ఎవ్వరూ నిన్ను పొగిడే వాళ్లు లేరు అని గ్రహించి నిన్ను నువ్వు పొగుడుకున్నావ్. అంతకన్న ఏం చేయగలవులే పాపం" అన్నాడు ఈసఫ్.

అసమర్థులే తమను తాము వేరెవరూ పొగడరు అని గ్రహించి పొగడుకుంటారు.

## 11

తోడేలు గొర్రెపిల్లను చూసి వెంట పడింది. గొర్రెపిల్ల



పారిపోయి దారిలో కాళికా అమ్మవారి గుడి కనిపిస్తే అందులోకి దూరి తలుపు బిగించుకుంది.

తోడేలు గుడి తలుపుల ముందు నిలుచుని "ఓ గొర్రె పిల్లా! అమ్మవారి గుళ్లో దూరావు. నా మాట విని


బయటకురా. అక్కడ వుండడం నీకు క్షేమం కాదు. గుడి పూజారి చూస్తే అమ్మ వారికి నిన్ను బలిచేయవచ్చు. నా మాటవిని వచ్చేయ్" అంది.

"ఓ తోడేలా! నీ చేతుల్లో పడి చచ్చేకంటే అమ్మవారి పాదాల ముందు బలికావడం నాకు ఇష్టమే. చావువల్ల నాకు స్వర్గమే లభిస్తుంది ఇక్కడ" అని జవాబు చెప్పింది. గొర్రెపిల్ల.


దుష్టులకు లొంగిపోవడం కన్నా ఒక మంచి
పనికి బలికావడమూ సబబే.

## 12

జబ్బు పడిన దుప్పి ఒకటి ఒక పొలంలో మూలగా పడుకుంది. జబ్బు వలన తిరగలేను అని గ్రహించి ఒంట్లో ఓపిక వున్నప్పుడు ముందుగానే వెళ్లి ఆహారం పోగుచేసుకుని వచ్చి అక్కడ పెట్టుకుంది.



దుప్పి బంధువులు, స్నేహితులు జబ్బుతో వున్న దానిని చూడడానికి వచ్చాయి. ఆరోగ్యం గురించి



పరామర్శ చేసాయి. ఇలా పరామర్శ చేయడానికి వచ్చినట్లే వస్తూ దుప్పి కష్టపడి పోగుచేసుకున్న ఆహారం అంతా అవి తిని వెళ్లిపోయాయి.

ఆఖరికి జబ్బు వల్ల కాక ఆకలి బాధతో చచ్చి పోయింది ఆ దుప్పి.

మేలుకన్నా హాని చేసేది చెడ్డస్నేహితులే.


## 13

ఒక కోడిపుంజు ఇంకొక పుంజుతో పోరుచేసి ఓడిపోయింది. శత్రువుకు భయపడి పారిపోయి ఒక మూల దాగుకుంది.

పోట్లాటలో గెలిచిన కోడిపుంజు గర్వంగా ఠీవిగా ఒక ఎత్తయిన గోడమీదకు ఎక్కి తన గొప్పలు పెద్దగా కూయడం మొదలు పెట్టింది. తన గెలుపు అందరికీ చాటింపు వేసు కోవాలని దాని ప్రయత్నం.


ఇంతలో ఆకాశంలో పోతున్న ఒక రాబందు ఎత్తయిన గోడ ఎక్కి కూస్తున్న కోడిపుంజును ఎగరేసుకు పోయింది. ఓడిన కోడిపుంజు బయటకు వచ్చి నిర్భయంగా తన పెట్టలతో తిరగసాగింది.

గర్వం వినాశనం కలిగిస్తుంది. ఒదిగిన వినయం కరుణకు పాత్రమౌతుంది.



## 14

ఒక ఆడసింహం కాన్పు అయినప్పుడల్లా ఒకే ఒక పిల్లను కంటూ వుండేది. ఆడ నక్క ఒకటి ఒక మారు ఆడ సింహం దగ్గరకు వచ్చి హేళన చేస్తూ -



"నాకు చూడు. ప్రతి కాన్పుకు ఎన్నో పిల్లలు పుడతాయి. నువ్వేమిటి ఒక్క పిల్లను మాత్రం కంటూ వుంటావ్?" అంది.



"అవును నేను ఒక్క పిల్లనే కంటాను. కానీ అది ఏమిటో తెలుసా? నక్క కాదు సింహం" అంది ఆడ సింహం. ఆ సమాధానం విని సిగ్గుతో తలవంచుకు వెళ్లిపోయింది నక్క.

## 15

వేటకుక్క ఒకటి సింహాన్ని తరమడం మొదలు పెట్టింది. కానీ సింహం ఒక్కసారి వెనుకకు తిరిగి గర్జించే సరికి కుక్క భయపడి వెనక్కు పారిపోసాగింది.

అప్పుడు ఒక నక్క దానిని చూసి ఇలా అంది.

"ఓ పనికి మాలిన కుక్కా! సింహాన్నే వెంటాడి వేటాడాలని చూసావ్. కానీ అది వెనుదిరిగి అరిచే సరికే అరుపుకే భయపడి వెనుదిరిగావు. నిన్ను ఏమనాలో తెలియడం లేదు."

తమకంటే బలవంతులను అణచాలని యత్నించి కుక్కలా భంగపడే వారుంటారు.

## 16

పక్షులకూ, జంతువులకూ చాలా ఏళ్ల క్రితం యుద్ధాలు జరిగాయిట. పక్షులన్నీ ఒక పక్షం. జంతువులు మరో పక్షం. ఒక మారు గెలుపు పక్షులకు దక్కితే ఇంకొక మారు జంతువులది.

గబ్బిలం మటుకు పక్షుల్లో చేరలేదు. జంతువుల్లోనూ చేరలేదు. రెండుపక్షాల మధ్యా యుద్ధం జరిగినప్పుడల్లా చివరకు ఎవరు గెలిచేటట్టు వుంటే వారి పక్షాన చేరి పోతూండేది.

కొంతకాలానికి పోరాటం ఆగిపోయింది. రెండు పక్షాలకు సంధి కుదిరి శాంతి సంభవించింది. అప్పుడు జంతువులకూ, పక్షులకూ కూడా గబ్బిలం మోసం, ద్రోహ చింతన తెలిసిపోయి దానిని రెండు వైపులా బహిష్క రించారు. తమలో ఎవరూ గబ్బిలాన్ని చేర్చుకోలేదు.

అందువల్ల గబ్బిలం పగలు బయటకు రాదు. వెలుగు చూసే ప్రాప్తం లేకపోయింది. ఎక్కడో చీకటిలో దాగుకుని, రాత్రిళ్లు ఒంటరిగా తిరగవలసిన దుర్గతి పట్టింది.

ద్రోహబుద్ధి కలవారు ఎవరికీ విశ్వసనీయులుకారు.

## "నిరంతర విద్యా కేంద్రములకు" ఉపయోగపడు మా ప్రచురణలు

స్వామీ వివేకానంద

అమరజీవి

కందుకూరి వీరేశలింగం

ఈసఫ్ నీతికథలు

నవ్వుకుందాం

మన పండుగలు

జానపద కళారూపాలు

అన్నమాచార్యులు

బాలకార్మికులు

నీరు

పురాణబాలలు

జలకాలుష్యం

వాయుకాలుష్యం

శబ్దకాలుష్యం